సాక్షి అనంతపురం

ఆదివారం । 21 । మే । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 790 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



పిడుగుపాటుకు వ్యక్తి మృతి

రాయదుర్గంలో శనివారం పిడుగుపాటుకు నారాయణరెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు తప్పించుకున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.7°/25.6°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

'మోడల్'లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

రాప్తాడురూరల్: జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.సాయిరామ్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి జూన్ 7లోపు https://apms.apcfss.in, https://cse.ap.gov.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేయాలని సూచించారు. పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

పాలిసెట్‌లో 84 శాతం మంది అర్హత



కుమ్మర హర్షవర్ధన్, ఎం.సంజనా రెడ్డి, పి.విశాల్

అనంతపురం: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు 84.46 శాతం మంది అర్హత సాధించారు. ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. 4,859 మంది బాలురకు గాను 4,023 మంది (82.79 శాతం), 3,260 మంది బాలికలకు గాను 2,834 మంది (86.93 శాతం) అర్హత సాధించారు. రాయదుర్గం టీచర్స్ కాలనీకి చెందిన కుమ్మర హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయిలో 89వ ర్యాంకు సాధించడంతో పాటు జిల్లా టాపర్‌గా నిలిచాడు. అనంతపురం వేణుగోపాల్ నగర్‌కు చెందిన ఎం.సంజనా రెడ్డి రాష్ట్ర స్థాయిలో 98, జిల్లాలో రెండో ర్యాంకు, శారదానగర్ మొదటి క్రాస్‌కు చెందిన పి.విశాల్ రాష్ట్రస్థాయిలో 151, జిల్లాలో మూడో ర్యాంకు సాధించారు.

ముగిసిన లాసెట్

అనంతపురం: మూడు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం ఏపీ లాసెట్–2023 పకడ్బందీగా నిర్వహించారు. మొత్తం 697 మంది విద్యార్థులకు గాను 588 మంది హాజరయ్యారు. అనంతపురంలోని ఎస్‌ఆర్‌ఐటీ, ఎస్వీఐటీ, గేట్స్ , పీవీకేకే కాలేజీల్లోని కేంద్రాల్లో లాసెట్ పరీక్ష నిర్వహించారు.

కొండ కోనల్లో జంతు వికాసం

- పెరుగుతున్న అడవి జంతువుల సంఖ్య
- నందడి చేస్తున్న చిరుతలు, జింకలు, దుప్పులు
- చిట్టడవుల్లో నెమళ్ల కనువిందు
- కొండచిలువలకు ఆవాసాలుగా ఉమ్మడి అనంత అటవీ ప్రాంతం
- రాష్ట్రంలో అంతరించి పోతున్నా ఇక్కడ మాత్రమే తోడేళ్ల ఉనికి



వజ్రకరూరు మండలం చాబాల వద్ద పంట పొలంలో జింకల గుంపు



నాట్య మయూరాల సందడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం:
అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అడవి జంతువుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పలు జంతు జాతులు ఇక్కడి అటవీ ప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నాయి. ముఖ్యంగా చిరుత పులుల సంఖ్య పెరుగుతున్నట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఒకప్పుడు పదిలోపే ఉన్న చిరుతల సంఖ్య ఇప్పుడు 30 నుంచి 40కి పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. చిరుతల సంఖ్య పెరుగుతుండటంతో ఇతర మూగ జీవాలపైన దాడులు కూడా కాస్త పెరిగాయి. రెండ్రోజుల క్రితం బ్రహ్మసముద్రం మండలంలో ఓ ఆవుపై చిరుత దాడిచేసి కొంత భాగాన్ని ఆరగించింది. గొర్రెలు, మేకలపైనా గడిచిన ఏడాది కాలంలో 40కి పైగా దాడులు జరిగాయి. చిరుతలకు ఆవాసాలుగా అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, శ్రీసత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, పెనుకొండ అటవీ ప్రాంతాలు ఉన్నాయి.

జింకల సందడి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జింకల సంఖ్య ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరుగుతున్నట్లు తేలింది. చిట్టడవులు, పచ్చిక బయళ్లు, రకరకాల పశుగ్రాసం అందుబాటులో ఉండడం వాటి వృద్ధికి దోహదపడుతోంది. కృష్ణ జింకలు, చుక్కల దుప్పులు ఏటికేటికీ పెరుగుతున్నాయి. వీటివల్ల ఒక్కోసారి రైతులకు పంట నష్టం కూడా జరుగుతోంది. నష్ట నివారణ కోసం అటవీ అధికారులు రైతులకు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.

తోడేళ్లు.. నక్కలు.. హైనాలు

వాస్తవానికి తోడేళ్ల సంఖ్య రాష్ట్రంలోనే అంతరించిపోతోంది. అలాంటిది ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోడేళ్లు ఇంకా ఉన్నట్టు అటవీశాఖ పరిశీలనలో తేలింది. వీటితో పాటు హైనాలు, నక్కలు కూడా బాగానే ఉన్నాయి. ఎలుగుబంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఉదయం పూట బహిర్భూమికి వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి.

లెక్కలేనన్ని నెమళ్లు..

నెమళ్లు ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో లెక్కలేనన్ని ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కోసారి జనావాసాల మధ్యకు వచ్చి విన్యాసాలు చేస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడటం, అనుకూలమైన వాతావరణం, చిట్టడవులు బాగా వృద్ధి చెందడం తదితర కారణాలతో నెమళ్లు వృద్ధి చెందాయి. ఇక కొండచిలువల సంఖ్య కూడా బాగానే పెరుగుతున్నట్టు అటవీ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. వీటి కారణంగా ఇప్పటివరకూ మూగజీవాలకు గానీ, మనుషులకు గానీ ఎలాంటి హానీ జరగలేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన అడవి జంతువుల సంఖ్య (అంచనా)

చిరుతలు	40
జింకలు	3 వేలు
చుక్కల దుప్పులు	250
తోడేళ్లు	20

సానుకూలంగా ఉండటం వల్లే



అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న అడవులు చిరుతలు, జింకలు, నక్కలు, తోడేళ్లకు సానుకూలంగా ఉన్నాయి. వీటి వృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం. చిరుతల నుంచి రక్షణకు వాటి సంచార ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చిరుతల నుంచి ప్రమాదం లేకుండా చూసుకోవచ్చు.
– సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్టు అధికారి

ఇసుక నిల్వలు పెరగాలి

- కొత్త రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టండి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: వర్షాకాలం ప్రారంభానికి ముందే సాధ్యమైనంతమేర జిల్లాలో ఇసుక నిల్వలు పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు, తదితర అవసరాలకు వర్షకాలంలో ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పక్క రాష్ట్రాలకు ఇసుక తరలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పామిడి, గార్లదిన్నె మండలం ఇల్లూరు, కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామాల్లో కొత్తగా గుర్తించిన బహిరంగ ఇసుక రీచ్‌లకు సంబంధించి పర్యావరణ అనుమతులు త్వరగా తీసుకుని ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తాడిపత్రి డివిజనల్ అధికారి నాగయ్య, భూగర్భజల శాఖ డీడీ తిప్పేస్వామి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఐబీ డివిజన్ ఈఈ ప్రతాప్, సెబ్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు, ఆర్‌టీఓ సురేష్ నాయుడు, జేపీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీఎఫ్‌సీ నిర్మాణాలు పూర్తి చేయండి..

జిల్లాలో చేపట్టిన ఎంపీఎఫ్‌సీ (బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రం) నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ఎంపీఎఫ్‌సీ భవనాల నిర్మాణంపై అధికారులతో ఆమె సమీక్షించారు. తొలిదశలో గుర్తించిన 84 గోదాముల్లో రెండు మాత్రమే పూర్తి కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశలో మంజూరు చేసిన 61 గోదాముల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'ఉపాధి'లోకి పట్టు పరిశ్రమ

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పట్టుపరిశ్రమ (సెరికల్చర్)ను సైతం భాగస్వామ్యం చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పట్టు పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రోత్సాహాల కోసం ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 2.5 ఎకరాల్లోపు భూములున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఎకరాకు దాదాపు రూ.1.10 లక్షల నిధులను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. పొలంలోనే షెడ్డు కూడా నిర్మించుకోవచ్చని తెలిపారు. రైతులు మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేవీకేలో విత్తనాల అమ్మకం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వరి, కంది, పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. వరి బీపీటీ–5204 రకం 30 కేజీల బస్తా రూ.1,200, కంది పీఆర్‌జీ–176 కేజీ రూ.120, పెసర డబ్ల్యూజీజీ–42 కేజీ రూ.125లకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. విత్తనాలు కావాల్సిన రైతులు 7013571755, 7032058368, 9989623825 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

43 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ప్రొబేషన్ పూర్తి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లలో రెండో విడత కింద 43 మందికి ప్రొబేషనరీ కాలం పూర్తయిందని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) భాగ్యరాజ్ శనివారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 33 మంది, అనంతపురం జిల్లాలో 13 మంది అర్హత సాధించారన్నారు. వీరందరికీ ఇకపై పూర్తి స్థాయి జీతాలు అందుతాయని వెల్లడించారు. మరో 13 మంది మిగిలి ఉన్నారని, అయితే వీరిలో కొందరికి పోలీస్ ఎంక్వైరీ పూర్తి కాలేదని, వివిధ కారణాలతో మరికొందరి ప్రొబెషన్ కాలం పూర్తి కాలేదని స్పష్టం చేశారు.

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రానున్న మూడు రోజులు జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ ప్రాంతంలో నైరుతి రుతుపవనాల కదలిక అనుకూలంగా ఉందన్నారు. దీనికి తోడు బీహార్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణా ప్రాంతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని, ఆంధ్రప్రదేశ్, యానాం పరిధిలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ, నైరుతీ గాలుల ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే సూచన ఉందన్నారు.

పిల్లలకు చదువే ఆస్తి

- ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యం
- ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఆలూరి సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం: పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువేనని, మన అంతస్తు, హోదా అన్నీ పెరగాలంటే మంచి చదువులు ఒక్కటే మార్గమని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. విద్యారంగంలో జగన్ సర్కార్ అమలు చేస్తున్న సంస్కరణల ఫలితాలు అద్భుతాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్ఆర్ఐటీ ఆధ్వర్యంలో శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. గత మూడేళ్లలో విద్యారంగంలో సంస్కరణలకే ఏకంగా రూ.54 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి సకల సౌకర్యాలు కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ శ్రమ వృథా కాలేదని.. అత్యున్నత ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రపంచ స్థాయి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యమని ఆ దిశగా ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నత చదువులు అభ్యసించి సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగం చేయడం కంటే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులను సత్కరించి, నగదు పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో కొర్రపాడులోని గురుకుల పాఠశాలకు చెందిన ఎం.స్పందన, బీకేఎస్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎ.నవ్య, ఇదే మండలం వెంకటాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి లాలా చంద్రిక, శింగనమల మండలంలోని బండమీదపల్లి చాందిని, శింగనమల తనుశ్రీ,, తరిమెల జె.నవ్య, గార్లదిన్నె మండలం ఏపీఎంఎస్ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, కె.పల్లవి, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎం.ప్రశాంత్, ఎం.హేమంత్‌కుమార్‌రెడ్డి, నార్పల మండలం కేశేపల్లికి చెందిన పి.వంశీకృష్ణారెడ్డి, డి.మధుసూదన్ (బి.పప్పూరు), నార్పలకు చెందిన ఎం.శ్రావ్య, జి.పావని, పుట్లూరు మండలం కడవకల్లుకు చెందిన కె.జశ్వంత్‌రెడ్డి, బి.అనురాధ (కేజీబీవీ), ఆర్.అర్చన (ఏపీఎంఎస్), యల్లనూరు మండలం చిలమకూరు ఏపీఎంఎస్ విద్యార్థి ఎస్.లోకేశ్వరి, తిమ్మంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జె.స్పందన, ఆర్.తనూష ఉన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు!

తాడిపత్రి అర్బన్: వివాహిత హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కట్టుకున్నవాడే ఆమెను హతమార్చినట్లు నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ ఆనందరావు వెల్లడించారు. ఈ నెల 18న తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని నందలపాడులో వివాహిత శివమ్మ (47) హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసు విచారణలో భాగంగా తన తండ్రిపై కుమారుడు రవీంద్ర అనుమానాలు వ్యక్తం చేయడంతో హతురాలు శివమ్మ భర్త కానాల రంగనాథరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో తన భార్యను తానే హత్య చేసి కిరోసిన్ పోసి నిప్పంటించినట్లు రంగనాథరెడ్డి అంగీకరించాడు. ఏడాదిగా వారి మధ్య కలహాలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ క్రమంలో 17న రాత్రి ఘర్షణ పడి ఇంటి వరండాలో మంచంపై నిద్రిస్తున్న శివమ్మ తలపై పప్పుగుత్తితో మోది హతమార్చాడు. అనంతరం ఇంట్లోని పాత దుస్తులను శివమ్మ మృతదేహంపై వేసి కిరోసిన్ పోసి నిప్పంటించి మిద్దె ఎక్కి నిద్రపోయాడు. 18న ఉదయం కిందికి వచ్చి తన భార్య ఆత్మహత్య చేసుకుందని కట్టుకథ అల్లాడు. ఘటనపై కుమారుడు రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ మొదటి సంవత్సర ప్రవేశాలకు శనివారం జిల్లాలో నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష 24 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగింది. 5,747 మంది విద్యార్థులకు గాను 4,679 మంది హాజరయ్యారు. ఏపీఆర్‌జేసీ,డీసీ సెట్ 33 కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగింది. 7,890 మంది విద్యార్థులకు గాను 6,468 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, ఏపీఆర్ఎస్, ఏపీఆర్‌జేసీ సెట్ జిల్లా కోఆర్డినేటర్ బీఈ ప్రభాకర్ వివిధ సెంటర్లను తనిఖీ చేశారు.

సహజ వాయువుల కోసం అన్వేషణ

- ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన డ్రిల్లింగ్



పుట్లూరు సమీపంలో బోరుబావి తవ్వుతున్న దృశ్యం

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) చమురు, సహజ వాయువుల కోసం అన్వేషణ చేపడుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూమిలోని చమురు, సహజ వాయువుల నిక్షేపాల శాతాన్ని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. 30 నుంచి 35 మీటర్ల వరకు బోరుబావులు తవ్వుతున్నారు. ఈ ప్రక్రియను సమీప గ్రామాల ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇప్పటికే సి.వెంగన్నపల్లిలోని బోరుబావుల నుంచి గ్యాస్ పుష్కలంగా రావడం అందరికీ తెలిసిన విషయమే. సర్వే పనులు పూర్తి కావడానికి మరో మూడు నెలలు పట్టే అవకాశముంది.

విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ తెలిపారు. రాయితీ విత్తన వేరుశనగ కోసం శనివారం నాటికి 16 వేల క్వింటాళ్లకు 18 వేల మంది రైతులు తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. పంపిణీ మొదలు పెట్టేలోపు విత్తనం అవసరమైన రైతులందరూ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం ఉప్పరపల్లిలోని జస్వంత్ ప్రాసెసింగ్ ప్లాంట్, శింగనమల మండలంలోని సాయి విత్తన శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించడమే కాకుండా 30 కిలోలకు తక్కువ కాకుండా బస్తాలు ఉండాలని సూచించారు. ప్రధానంగా 74 శాతం కన్నా ఎక్కువగా అవుటన్ (షెల్లింగ్) ఉండాలన్నారు. నాసులు, రాళ్లు, పుచ్చులు లేకుండా ఫిజికల్ ప్యూరిటీ 94 శాతం కన్నా అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 132 ఆర్‌బీకేలకు శనివారం నాటికి 9,200 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి తెలిపారు. కే–6 రకం 30 కిలోల బస్తాకు 1,674, 1218 రకం 30 కిలోల బస్తాకు రూ.1,494 చొప్పున రైతులు చెల్లించాలని సూచించారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 90 కిలోలు ఇస్తామన్నారు. సాధ్యమైనంత తొందరగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



నారాయణరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డు చివర్లో ఉన్న వాటర్ ట్యాంకు సమీపాన శనివారం పిడుగుపాటుకు ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీబజారులో నివాసం ఉంటున్న నారాయణరెడ్డి (50), కణేకల్లు మండలం జక్కలవడికి గ్రామానికి చెందిన టైలర్ వెంకటేశులు, బలరామ్ భోజనం కోసం చింతచెట్టు కిందకు వెళ్లారు. వర్షం కురవడంతో కొంతానపల్లికి చెందిన మరో వ్యక్తి వారి వద్దకు చేరాడు. వర్షానికి తడవకుండా చెట్టుతొర్రలో తలదాచుకున్నారు. ఇంతలోనే చెట్టుపై పిడుగు పడింది. నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. టైలర్ వెంకటేశులు తీవ్రంగా గాయపడ్డాడు. బలరామ్ స్పృహతప్పి పడిపోగా, కొంతానపల్లి చెందిన వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. గమనించిన స్థానికులు వారిని చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టైలర్ వెంకటేశులు పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపారు. కాగా.. మృతుడు నారాయణరెడ్డి స్వగ్రామం డి.హీరేహాళ్ మండలం ఎం.హనుమాపురం. పదేళ్ల క్రితం నుంచి రాయదుర్గంలోని లక్ష్మీబజారులో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పరామర్శించిన విప్ కాపు దంపతులు..

ఘటన గురించి తెలియగానే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి రాయదుర్గం ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పూర్వ విద్యార్థులతో ఆరా

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరుకు సంబంధించి పీర్ కమిటీ రెండో రోజు పర్యటన కొనసాగింది. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో పీర్ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఏ కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు? ఎంత ప్యాకేజీ వస్తుందని ఆరా తీశారు. గత ఐదేళ్లకు సంబంధించిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ వివరాలను పరిశీలించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వివరాలు తెలుసుకున్నారు. సివిల్, కెమికల్ విభాగాలకు సంబంధించిన ప్రయోగశాలలను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఎన్‌బీఏ పీర్ కమిటీ సభ్యులు జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఎన్‌బీఏ పీర్ కమిటీ సభ్యులు వర్సిటీ ప్రొఫెసర్లతో సమావేశమై... కళాశాల లోటుపాట్లను వివరించనున్నారు. ఆదివారం ఎన్‌బీఏ పీర్ కమిటీ పర్యవేక్షణ ముగియనుంది.

వెటర్నరీ అంబులెన్స్‌ల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (మొబైల్ వెటర్నరీ క్లినిక్) వాహనాలకు పైలెట్లు (డ్రైవర్లు), పశువైద్యులుగా పని చేయడానికి ఆసక్తి, అర్హత ఉన్న వారు వెంటనే సంప్రదించాలని మొబైల్ వెటర్నరీ క్లినిక్స్ శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి ముస్తాక్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్, హిందూపురం, ధర్మవరం ప్రాంతాల్లో మూడు డ్రైవరు పోస్టులు, పెనుకొండ, మడకశిర, హిందూపురంలో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పోస్టులకు 10 తరగతి పాసై, 35 సంవత్సరాల్లోపు వయసుతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఇక బీవీఎస్సీ, ఎంవీఎస్సీ కోర్సు చేసిన వారు డాక్టర్ పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న 65 సంవత్సరాల్లోపు వయసున్న విశ్రాంత పశువైద్యులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 81256 28308లో సంప్రదించాలని సూచించారు.

'పది'లోనే ఏడడుగులు

- వివాహం చేసుకున్న టెన్త్ విద్యార్థులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు

యల్లనూరు: ఇంకా బాల్యం దాటనే లేదు. బతుకుపై ఏ మాత్రమూ అవగాహన లేదు. అయినా వారిద్దరూ ఒక్కటయ్యారు. ఓ ఆలయం తలుపు వద్ద అమ్మాయి మెడలో అబ్బాయి పసుపు తాడు కట్టాడు. ఇక పెళ్లయి పోయిందని అనుకున్నారు. ప్రస్తుతం కలసి కాపురం కూడా చేసేస్తున్నారు. బాల్యవివాహాలు అరికట్టాలంటూ సమావేశాల్లో ఊదరగొట్టే అధికారులు..ఈ విషయం తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎవరు?.. ఎక్కడ?

అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కూచివారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇదే మండలం బొప్పేపల్లికి చెందిన బాలిక, పుట్లూరు మండలం కుమ్మనమల గ్రామానికి చెందిన బాలుడు పదో తరగతి వరకు కలసి చదువుకున్నారు. ఈ ఏడాది రాసిన పదో తరగతి పరీక్షల్లో ఇద్దరూ ఫెయిలయ్యారు. గురువారం సాయంత్రం పుట్లూరు మండల పరిధిలోని ఓ ఆలయానికి చేరుకున్న ఇద్దరూ అక్కడే పెళ్లి చేసుకున్నారు. మూసి ఉన్న ఆలయం తలుపు ఎదుట బాలిక మెడలో బాలుడు పసుపు తాడును కట్టిన దృశ్యాలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రస్తుతం ఇద్దరూ బాలుడి స్వగ్రామంలోనే ఉన్నట్లు సమాచారం.

చర్చ చేసిన గంటల వ్యవధిలోనే..

బాల్య వివాహాల నియంత్రణపై గురువారం ఉదయం మండల స్థాయి అధికారులు సమావేశమై చర్చించారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు సన్నాహాలు చేస్తుంటే పసిగట్టి తక్షణమే సమాచారం అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలను, సచివాలయ మహిళా పోలీసులను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశం ముగిసిన కొన్ని గంటల వ్యవధిలోనే బాల్య వివాహం జరగడం చర్చకు దారి తీసింది.

స్పందించని అధికారులు..

శనివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీడీఓ చాంబర్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ రమాదేవి దృష్టికి బాల్యవివాహం విషయాన్ని ఎంఈఓ చంద్రశేఖర్ తీసుకెళ్లారు. జరిగిన వృత్తాంతాన్ని వివరించి, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలు చూపించారు. అయితే దీనిపై అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పిల్లలు తెలిసీ తెలియక చేసిన తప్పిదాన్ని సరిదిద్దాల్సిన బాధ్యతను జిల్లా స్థాయి అధికారులైనా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: కూడేరులోని సంగమేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోపు దరఖాస్తులను 'సహాయ కమిషనర్ కార్యాలయం, దేవదాయ శాఖ, డోర్.నం.1–4–609, 2వఫ్లోర్, హెచ్చెల్సీ కాలనీ, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలని సూచించారు.

ఇన్‌చార్జ్ అసిస్టెంట్ అలెస్కోగా బాలమురళి

రాప్తాడు రూరల్: సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇన్‌చార్జ్ అలెస్కోగా బాలమురళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ అలెస్కో రవి లీవులో ఉన్న నేపథ్యంలో రాప్తాడు మండలం హంపాపురం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బాలమురళికి బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

కాలువ నిర్మాణాలు వేగవంతం చేయాలి



32వ డివిజన్‌లో మురుగు కాలువను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: నూతన కాలువ నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కార్పొరేటర్ కమల్‌భూషణ్‌తో కలసి 32వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. మొదటగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఈ రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

ఆత్మకూరు: విత్తన వేరుశనగ కాయలకు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఏఈఓ సుజిత తెలిపారు. శనివారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేశారు.

బాల్య వివాహాలు నేరం

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

రాప్తాడురూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం అనంతపురం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో 'బాల్య వివాహాల నిర్మూలన' అంశంపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులకు మండల స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలు ఉంటుందని హెచ్చరించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారి బాలసుబ్రమణ్యం, మెడికల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, సీడీపీఓ ధనలక్ష్మి, న్యాయవాది కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, హేమావతి, సుభాషిణి, ఆరోగ్య కార్యకర్తలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ స్కూల్ విద్యార్థినికి అభినందన



సంజనారెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

రాప్తాడురూరల్: పాలీసెట్ – 2023లో బాలికల విభాగంలో జిల్లా రెండో ర్యాంకు సాధించిన లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థిని ఎం. సంజనారెడ్డిని పలువురు అభినందించారు. శనివారం విడుదలైన పాలీసెట్ ఫలితాల్లో విద్యార్థిని 120 మార్కులకు గాను 117 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించింది. విద్యార్థిని తండ్రి ఎం.మధుసూదన్‌రెడ్డి లక్ష్మీసినర్జీ స్కూల్ కరస్పాండెంట్, తల్లి ప్రార్థనారెడ్డి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. సంజనారెడ్డి పదో తరగతిలో 586 మార్కులు సాధించింది. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'చెకుముకి' సైన్స్ టాలెంట్ పరీక్షలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తండ్రి తెలిపారు. రాష్ట్ర స్థాయి షటిల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచింది.

ఎన్‌పీసీబీ యూనిట్ తనిఖీ



డీఎంహెచ్‌ఓ వీరబ్బాయికి సమస్యలు తెలుపుతున్న డాక్టర్ సైదన్న

అనంతపురం క్రైం: నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ కంట్రోలింగ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) యూనిట్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్ శనివారం తనిఖీ చేశారు. శనివారం 'సాక్షి'లో 'సారూ కళ్లు తెరవండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై డీఎంహెచ్‌ఓ స్పందించి యూనిట్‌ను తనిఖీ చేశారు. యూనిట్‌లో అధిక సంఖ్యలో సర్జరీలు చేస్తున్నట్లు కానీ శానిటేషన్ నిర్వహణ, తదితర సదుపాయాలు లేవని డాక్టర్ సైదన్న, రోగులు, వారి సహాయకులు డీఎంహెచ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ, డీఐఓ బాత్‌రూంలను పరిశీలించగా, అధ్వానంగా ఉన్నాయి. తాగునీటి సౌకర్యం, సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిధిలో యూనిట్ ఉండడంతో నిర్వహణ బాధ్యత వారే చూసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌తో సమావేశం నిర్వహించి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎంహెచ్‌ఓ వెంట డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, యూనిట్ స్టాఫ్‌నర్సు హేమ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి





నారాయణపురంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, సన్మానం పొందిన వలంటీర్లు

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న వలంటీర్లే నిజమైన ప్రజాసేవకులని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు చేరువగా ఉన్న వలంటీర్ల వ్యవస్థ సమాజానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏనారాయణపురం, రాజీవ్‌కాలనీ పంచాయతీల పరిధిలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు శనివారం ఏ నారాయణపురం పంచాయతీ పరిధిలోని మసీదులో ఏర్పాటు చేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

ప్రజాసేవకులకు సమాజంలో గుర్తింపు..

ప్రజల కోసం పని చేసే వారికి సమాజంలో ఎప్పటికైనా తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి, ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల లబ్ధితో పాటు కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకొని, అమలు చేయాలని చూస్తుంటే.. చంద్రబాబు మాత్రం వలంటీర్ల వ్యవస్థపై హేళనగా మాట్లాడటం సరికాదన్నారు. జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజా ధనాన్ని టీడీపీ నాయకులకు దోచి పెట్టిన చంద్రబాబుకు ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న వలంటీర్ల వ్యవస్థపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది స్థానిక సమస్యలను తమ దృష్టికి రావడంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, ఈఓఆర్డీ అలివేలమ్మ, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, ఎంపీటీసీలు నాగేంద్ర, సంధ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి, సత్యన్న, అంజి, హుస్సేన్, రహీమ్, హాజీవలి పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం పురస్కారాలు

రామగిరి: మండలంలోని గంతిమర్రి, కుంటిమద్ది సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు శనివారం తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓఆజాద్, ఎంపీపీ కర్రెన్న, పురస్కారాలు అందించారు. ప్రభుత్వం వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం ఆయా పంచాయతీల్లోని వలంటీర్లకు సచివాలయాల్లో పురస్కారాలు అందించి, సత్కరించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు చేరవేసే క్రమంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ సర్పంచులు నరేంద్ర, చెన్నకేశవరెడ్డి, వీఆర్‌ఓలు ముత్యాలప్ప, రామాంజనేయులు, ఎంపీటీసీలు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రూత్'లోనే అబార్షన్

- రూ.50 వేలు చెల్లించా
- అధికారుల విచారణలో కవిత భర్త సాకే పెద్ద హనుమంతు



కవిత మృతిపై బాధితుల వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్న వైద్యాధికారులు

అనంతపురం క్రైం/ధర్మవరం రూరల్: తన భార్యకు అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న రూత్ ఆస్పత్రిలోనే అబార్షన్ చేశారని, ఇందుకు రూ.50 వేలను డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు చెల్లించానని మృతురాలు కవిత భర్త సాకే పెద్ద హనుమంతు అంగీకరించాడు. కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు కవిత మృతిపై జిల్లా వైద్యాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డెమో బృందం శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరు పీహెచ్‌సీ పరిధిలోని అమ్మవారిపల్లి, దర్శినమల పీహెచ్‌సీ పరిధిలోని చిగిచెర్ల గ్రామానికి వెళ్లారు. మొదట కవిత భర్త సాకే పెద్ద హనుమంతు(ఆటో డ్రైవర్)ను విచారించగా, ఆయన పూర్తి స్థాయిలో సహకరించలేదు. గర్భంలో పిండం బాగోలేదన్న కారణంగా వైద్యురాలు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అబార్షన్‌కు రూ.50వేలు తీసుకుందని తెలిపాడు. అనంతరం కవిత తల్లిదండ్రులు ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, చెల్లెలు సుజాత విచారణకు పూర్తిగా సహకరించారు. అబార్షన్‌కు సంబంధించి డాక్టర్ రూ.50వేలు అడగడంతో తాము రూ.23 వేలు సమకూర్చామని, మిగిలిన డబ్బు అల్లుడినే వేసుకోవాలని తెలిపామన్నారు. 'ఈ నెల 14న రూత్ ఆస్పత్రిలో కవితను అడ్మిట్ చేస్తే డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అదే రోజున మందులు ఇచ్చారు. ఈ నెల 15న ఉదయం 9.30 గంటలకు అబార్షన్ చేశారు. అదే రోజు రాత్రి చిగిచెర్లకు పిలుచుకొచ్చాం. ఈ నెల 16న కళ్లుతిరుగుతున్నాయంటే కవితను వెంటనే రూత్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడ సిబ్బంది మేడమ్ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే పని చేస్తారు. అక్కడికే వెళ్లండని చెప్పారు. ఆస్పత్రికి తీసుకెళ్లగానే చనిపోయిందని డాక్టర్లు చెప్పారు' అంటూ బోరున విలపించారు.

ఎంటీపీకి అనుమతి లేదు..

రూత్ ఆస్పత్రి నిర్వహణకు, అబార్షన్ (ఎంటీపీ) చేసేందుకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు అనుమతులేవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కవిత కుటుంబసభ్యులిచ్చిన లిఖితపూర్వక స్టేట్‌మెంట్ ఆధారంగా కలెక్టర్ గౌతమికి నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. విచారణలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వని, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్లు సుబ్రమణ్యం, వేణుగోపాల్, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీకి యూరిటరో రెనోస్కోపీ వితరణ



యూరాలజీ విభాగానికి పరికరాన్ని అందజేస్తున్న నిత్యన్నదాన ట్రస్టు సభ్యులు

అనంతపురం క్రైం: కిడ్నీ రోగుల చికిత్సకు ఉపయోగపడే యూరిటరో రెనోస్కోపీ యంత్రాన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని యూరాలజీ విభాగానికి నిత్యాన్నదాన ట్రస్టు నిర్వాహకులు శనివారం అందజేశారు. రూ.3 లక్షల విలువ చేసే యంత్రాన్ని అందజేసిన ట్రస్ట్ సభ్యులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రంగస్వామి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, నిత్యాన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు లక్ష్మీనరసింహస్వామి, సభ్యులు లక్ష్మి, నాగరాజు, గీతవాణి, మురళీకృష్ణ, భార్గవి, పరిమళ, నరేంద్రనాథ్, ఆలంబన జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు

- పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన భవన నిర్మాణాలు, సిమెంట్ రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్ ఆదేశించారు. తన చాంబర్ నుంచి శనివారం సాయంత్రం ఆయన ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లతో ఆయన మాట్లాడారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ కాగానే కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయన్నారు. భవనాలు, రహదారుల నిర్మాణాలకు సంబంధించి కేవలం రెండు నెలల వ్యవధిలో రూ.39 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. నిర్దేశిత గడువులోపు మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఈఈ ప్రసాద్, ఏఈఈలు హుస్సేన్‌బాషా, లక్ష్మీదేవి, గాయత్రి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

ఆత్మకూరు: మంజూరైన ప్రతి ఇల్లూ త్వరితగతిన పూర్తి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అధికారులకు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు తెలియజేశారు. శనివారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీఓ ఓబుళమ్మతో కలిసి జగనన్న ఇంటి నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాల్లో ఏవైనా సమస్య లుంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పంచాయతీరాజ్ ఇంజనీర్ పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సర్పంచ్ రేణుకమ్మ, పంచాయతీ కార్యదర్శి రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభించిన మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ చేపట్టనున్న రీసైక్లింగ్ ప్రక్రియకు నగర ప్రజలు సహకరించి, పర్యావవరణ పరిరక్షణకు పాటుపడాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. నగరంలోని 24వ డివిజన్ నవోదయ కాలనీలోని 40వ సచివాలయంలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్‌ను మేయర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి డివిజన్‌లో సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నగరంలోని 50వ డివిజన్‌లోని కొత్త రైల్వే గేట్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను మేయర్ వసీం ప్రారంభించారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, డీఈ రాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్ శేఖర్‌బాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, నాయకులు భాజా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి :

పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల ఈపీఎఫ్, ఈఎస్ఐ, యూనిఫాం అలవెన్సులు, సబ్బులు, కొబ్బెర నూనె, తదితర సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్మికులతో కమిషనర్ సమావేశమయ్యారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఈ రాంప్రసాద్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు నాగేంద్రకుమార్, రాజమోహన్, నాగభూషణం, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అలమూరు లేఅవుట్ పరిశీలన: నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆలమూరులోని జగనన్న లేఅవుట్‌ను శనివారం పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు.

ఆదర్శవంతంగా జగనన్న కాలనీలు



కనగానపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఈ, మండల నాయకులు

కనగానపల్లి: జగనన్న కాలనీలను ఆదర్శవంతగా తీర్చుదిద్దుతున్నామని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీని స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఆయన పరిశీలించారు. కాలనీలోని ఇళ్ల నిర్మాణాల నాణ్యతను ఆయన పరిశీలించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, ఇసుక, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రితో పాటు బేల్దార్లను కూడా సమకూర్చుకొని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. కనగానపల్లి జగనన్న కాలనీలో ప్రస్తుతం 40కి పైగా గృహాల నిర్మాణాలు పూర్తవుతున్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అంకె అశోక్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు రమేష్, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని మేయర్ వసీం పేర్కొన్నారు. రాష్ట్రంలో 33 లక్షల మందికి, అనంతపురం అర్బన్ పరిధిలో 23 వేల మందికి సొంతింటి కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది అని, ప్రజలకు ఎంతో మేలు చేస్తుంటే చంద్రబాబు మాత్రం ఓర్వలేకపోతున్నారని అన్నారు. శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెంటు భూమి సమాధికి కూడా సరిపోదని ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను మేయర్ ఖండించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు చౌకబారు వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్తున్న ప్రభుత్వంపై ఓర్వలేక బురదజల్లుతున్నారన్నారు. పేదలు, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అందుకే ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారన్నారు.

తప్పుదోవ పట్టించేందుకే దుష్ప్రచారం..

గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు వారి మద్దతును తెలియజేయడంతో పాటు మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుంటామని చెప్తున్నారని, దీంతో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వణుకుపడుతోందని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదల గురించి ఆలోచించిన దాఖలాలున్నాయా? అని ప్రశ్నించారు. ఎప్పుడూ హైదరాబాద్‌లో హైటెక్ సిటీని తానే తెచ్చానని, ఐటీని కూడా అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకోవడానికే సరిపోతోందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం గురించి ఏనాడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు.

అర్ధరాత్రి అల్లరిమూకల హల్‌చల్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరం నిద్రపోతున్న వేళ..ఆకతాయిలు బైక్ మోతలతో హల్‌చల్ చేశారు. శనివారం నగరంలోని నడిమివంక, తపోవనం వైపు వెళ్లే 44వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై తెల్లవారు జామున 2 గంటల సమయంలో బైక్‌లతో నానాయాగీ చేశారు. స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ఆకతాయిలు సుమారు నాలుగైదు సార్లు వాహనాలను అతివేగంగా సైలెన్సర్లతో పెద్ద శబ్దాలు చేస్తూ ఇబ్బందికి గురి చేశారు.

హైవేపై అరాచకం:

రాత్రి అయ్యిందంటే చాలు..అల్లరిమూకలు హైవేపై హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల ఓ యువకుడు అమ్మాయితో కలిసి అర్ధరాత్రి 12 గంటల సమయంలో పుట్టినరోజు వేడుకలంటూ టపాసులు పేల్చి నానా హైరానా చేశారు. వాహనదారులు వీరి పిచ్చి చేష్టలు చూడలేక నాల్గో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇద్దరినీ బళ్లారి బైపాసు చౌరస్తాదాకా తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఎంఆర్ఐ సేవలకు అంతరాయం

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రిలో శనివారం సాయంత్రం నుంచి ఎంఆర్ఐ సేవలకు అంతరాయం ఏర్పడింది. స్కాన్ సెంటర్‌లో మరమ్మతులు చేస్తుండడంతో ఎంఆర్ఐ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆదివారం కూడా మరమ్మతు పనులు జరుగుతుండడంతో సేవలకు తాత్కాలికంగా అంతరాయం ఉంటుందని ఆర్ఎంఓ డాక్టర్ వైవీరావు తెలిపారు. సోమవారం నుంచి యధావిధిగా సేవలు కొనసాగుతాయన్నారు.

శాంతినారాయణ జీవితం స్ఫూర్తిదాయకం



ప్రసిద్ధ వ్యక్తుల పుస్తకాలను పరిచయం చేస్తున్న డాక్టర్ శాంతినారాయణ, ఎల్ఎం ఉమ

అనంతపురం కల్చరల్: డాక్టర్ శాంతినారాయణ జీవితం స్ఫూర్తిదాయకమని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమ పేర్కొన్నారు. శనివారం కేంద్ర గ్రంథాలయానికి ప్రసిద్ధులైన పలువురు రచయితలకు చెందిన 500 పుస్తకాలను సీనియర్ కథా, నవలా రచయిత డాక్టర్ శాంతినారాయణ ఉచితంగా అందించారు. అనంతరం డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వేసవి సెలవుల్లో పాఠకులందరికీ ఉపయుక్తంగా ఉంటాయని, ప్రముఖ రచయితల గ్రంథాలను అందించినట్లు తెలిపారు. గ్రంథాలయాలను అందరికీ అందుబాటులోకి తెస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహనరెడ్డి, ఉమా మోహనరెడ్డి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు సెక్రటరీ రమ, సిబ్బంది శాంతినారాయణను సన్మానించారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ప్రజలు తమ అభిప్రాయాన్ని సంతకాలతో తెలియజేసినట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవికి మహిళా సమాఖ్య నాయకులు తెలిపారు. డీఆర్‌ఓను శనివారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్ వద్ద సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్, కోశాధికారి రామాంజనమ్మ, నాయకురాళ్లు శారద, జమలమ్మ, కుళ్లాయమ్మ, సారంబీలు కలిసి ప్రజలు సంతకం చేసిన వస్త్రాన్ని, వినతిపత్రాన్ని అందజేశారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అతనిపై వచ్చిన ఫిర్యాదులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయించాలన్నారు. తమ డిమాండ్లను, ప్రజల అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వంకు పంపించాలని కోరారు.

బావిలో పడి యువకుడి మృతి

రాప్తాడు రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సాయిరామ్ (28) ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం హుసేన్‌బీని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులతో అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట శివారులో ఉన్న ఓ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావి మెట్లమీద కూర్చొని నీళ్లు పోసుకుంటున్న సాయిరామ్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. అప్పటికే లోతుగా ఉన్న నీట మునిగి సాయిరామ్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నబీరసూల్ అక్కడికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో సాయిరామ్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తాడిపత్రి ఆలయాలను సందర్శించిన ఎస్పీ



ఎస్పీ దంపతులకు చింతల వేంకటరమణస్వామి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: ప్రసిద్ధిగాంచిన తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వేంకటరమణస్వామి ఆలయాలను కుటుంబసభ్యులతో కలసి ఎస్పీ శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. తొలుత వేంకటరమణ స్వామి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకుడు మురళీస్వామి, పాలక మండలి చైర్మన్ బాణా నాగేశ్వరరావు, సభ్యులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి శేష వస్త్రాలను, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఆలయ విశేషాలను వివరించారు. అనంతరం బుగ్గరామలింగేశ్వరస్వామి, ఆలూరు కోన రంగనాథ స్వామి ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఎస్పీ గంగయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.